

రూ.3 కోట్లతో రోడ్డు నిర్మాణం

సిపిఎం నేతలకు సింహాద్రిపురం వాసుల కృతజ్ఞతలు

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని సింహాద్రిపురం గ్రామ పరిధిలో సీసీ రోడ్డు నిర్మించనున్నట్లు ఆర్అండ్బి అధికారులు తెలిపారు. రోడ్డు అధ్వానంగా ఉందని, పెద్ద పెద్ద గోతులు ఉండడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నూతన రోడ్డు నిర్మించాలని రెండు రోజుల క్రితం సిపిఎం ఆధ్వర్యంలో గ్రామస్తులు ధర్నా చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు ఆధ్వర్యంలో, మండల కార్యదర్శి కొడవలి శ్రీనివాస్ అధ్యక్షతన ఆ పార్టీ నాయకులు, గ్రామస్తులు నిరసన తెలిపారు. దీంతో ఆర్అండ్బి శాఖాధికారులు స్పందించి రోడ్డుపై గోతులు పూడ్చి, రూ.మూడు కోట్లతో సిమెంట్ రోడ్డు నిర్మించనున్నట్లు తెలిపారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సిపిఎం నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

నేవీ ఆయుధ డిపో వద్దే.. వద్దు..




ర్యాలీగా గ్రామాల్లో పర్యటిస్తున్న నేతలు

- మూడు పంటలు పండే భూముల్లో ఎలా పెడతారు
- ఎంఎల్ఎ ఇంటి పక్కన అటవీ భూముల్లో ఏర్పాటు చేయండి
- మాలో విభేదాలు సృష్టించి డిపో ఏర్పాటుకు కుటిలయత్నాలు
- వామపక్ష రాష్ట్ర నేతల పర్యటనలో గిరిజనుల ఆవేదన
- కలెక్టర్, ప్రజాప్రతినిధులు చట్టాలను గౌరవించాలి : వామపక్ష నాయకులు
- గ్రామసభ తీర్మానం చేశాక కేబినెట్ తీర్మానం కూడా చెల్లదు
- గిరిజనులకు అండగా ఉంటామని నేతల భరోసా


సభలో నేతల అభివాదం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, జీలుగుమిల్లి

మూడు పంటలు పండే భూముల్లో నేవీ ఆయుధ డిపో ఏర్పాటు చేయాలని చూస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని, మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న అటవీ భూముల్లో ఆయుధ డిపో ఏర్పాటు చేసుకునే అవకాశమున్నా పట్టించుకోవడం లేదని జీలుగుమిల్లి మండలంలోని వంకావారిగూడెం పంచాయతీ పరిధిలోని దాట్లవారిగూడెం, రమణక్కపేట, మడకంవారిగూడెం, కొత్త సీమలవారిగూడెం గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. నేవీ ఆయుధడిపోకు వ్యతిరేకంగా పోరాడుతున్న గిరిజనులకు అండగా నిలిచేందుకు వామపక్ష పార్టీల రాష్ట్ర నాయకులు బాధిత గ్రామాల్లో సోమవారం పర్యటించారు. ఈ పర్యటనలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ కేంద్ర కమిటీ సభ్యురాలు అక్కినేని వనజ, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర నాయకులు హరినాథ్, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు కారం రాఘవన్, ఎస్యుసిఐ రాష్ట్ర నాయకులు సుధీర్, సిపిఐ (ఎంఎల్) నాయకులు నాగరాజుతోపాటు సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు ఎ.రవి. మన్నవ కృష్ణచైతన్య, ఆదివాసీ సంఘం నాయకులు మడకం వెంకటేశ్వరరావు, మానవ హక్కుల సంఘం నాయకులు పొట్టా నాగేశ్వరరావు, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు అశోక్, తెల్లం రామకృష్ణ, మొడియం నాగమణి, తెల్లం దుర్గారావు, కారం ధారయ్య, భూషణం, దుర్గారావు, కారెం భాస్కర్ ఇతర నాయకులు ఉన్నారు. వామపక్ష నాయకులు ముందుగా మడకంవారిగూడెం చేరుకోగా గ్రామ పొలిమేరల్లోకి గ్రామస్తులంతా వెళ్లి పూలమాలలు వేసి, పూలు చల్లి ఘన స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన ర్యాలీలో పంటలు పండే భూముల్లో ఆయుధ డిపో వద్దు, గిరిజనుల పొట్ట కొట్టొద్దు, ఆదివాసీల ఐక్యత వర్ధిల్లాలి అంటూ పెద్దఎత్తున నినదించారు. ఆయుధ డిపో ఏర్పాటుకు నిర్ధారించిన కొత్త సీమలవారిగూడెం గ్రామానికి వెళ్లి అక్కడి గ్రామాన్ని, పామాయిల్ తోటలను పరిశీలించారు. అక్కడి గిరిజనులతో నేతలు మాట్లాడారు. అక్కడ నుంచి దాట్లవారిగూడెం చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. ఐదు గ్రామాల ప్రజలతోపాటు, ఏజెన్సీలోని వివిధ ప్రాంతాల వారు సైతం పాల్గొని మద్దతు తెలిపారు. ముందుగా బాధిత గిరిజన ప్రజలు, పీసా కమిటీ నాయకులు అక్కడి పరిస్థితులను వివరించారు. అనంతరం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ కేంద్ర కమిటీ సభ్యురాలు ఎ.వనజ, ఇతర వామపక్ష నాయకులు మాట్లాడుతూ మూడు పంటలు పండే భూముల్లో ఆయుధ డిపో ఏర్పాటు చేయడం తగదన్నారు. గ్రామసభలో ఆయుధ డిపోను వ్యతిరేకిస్తూ తీర్మానం చేసిన తర్వాత కూడా ప్రజాప్రతినిధులు, అధికారులు అడ్డగోలు ముందుకెళ్లాలని యత్నించడం ఏమాత్రం మంచిది కాదన్నారు. ప్రజాభిప్రాయానికి విలువ లేదా అని ప్రశ్నించారు. గ్రామసభలకు వ్యతిరేకంగా తీర్మానం చేసిన తర్వాత కేబినెట్ తీర్మానం చేసినా చెల్లదన్నారు. ఐదు గ్రామాల్లో 1,166 ఎకరాల భూములు తీసుకుంటే ఇక్కడి ప్రజలకు ఉపాధి ఏవిధంగా దొరుకుతుందన్నారు. ఎంఎల్ఎ ఇంటి పక్కగా మూడు వేల అటవీ భూములు ఉన్నాయని, అక్కడ ఆయుధ డిపో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఉద్యోగాలు, అభివృద్ధి వంటి బూటకపు మాటలు చెప్పొద్దని, అన్నీ త్యాగం చేసిన పోలవరం నిర్వాసితుల పరిస్థితి ఏమిటనేది అందరూ చూస్తున్నారన్నారు. గ్రామస్తుల అభిప్రాయా నికి వ్యతిరేకంగా వెళ్తే పెద్దఎత్తున ఉద్యమం తప్పదని, గిరిజనులకు వామ పక్షాలు అండగా ఉంటాయని తెలి పారు. పోలీసులతో కేసులు పెట్టాలని చూస్తే ఎవరూ భయపడే ప్రసక్తి లేదన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తమ గ్రామాల్లో ఆయుధ డిపో ఏర్పాటుకు అంగీకరించే ప్రసక్తి లేదని గిరిజనులంతా ముక్తకంఠంతో తెలిపారు.


సభకు హాజరైన గిరిజనులు


వి.శ్రీనివాసరావు


అక్కినేని వనజ


కారం రాఘవ


నాగరాజు


సుధీర్

మాకు డిపో అవసరం లేదు.. మా భూములు మాకు కావాలి

నారం మల్లేశ్వరరావు, పీసా కమిటీ ఉపాధ్యక్షులు, మడకంవారిగూడెం



ఆయుధ డిపోపై వైసిపి హయాంలో ప్రయత్నిస్తే అడ్డుకున్నాం. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మళ్లీ గిరిజనుల భూములు లాక్కోవాలని చూస్తున్నారు. ప్రజాప్రతినిధులు పిలిచి మాట్లాడితే ప్రజాభిప్రాయమే.. మా అభిప్రాయం అని చెప్పాము. ఇక్కడ అంతా చిన్న, సన్నకారు రైతులం. మూడు పంటలు పండే భూములు తీసుకోవాలని చూస్తున్నారు. మాకు డిపో అవసరం లేదు. మా భూములు మాకు కావాలి.

ప్రజలతోనే ఉంటామని చెప్పాం

నారం రవి, పీసా కమిటీ కార్యదర్శి, దాట్లవారిగూడెం



ఎంఎల్ఎ పిలిచి మాట్లాడారు. ప్రజలతోనే ఉంటామని చెప్పాం. ఆయుధ డిపో ఏర్పాటును ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదు. ప్రజలతో ఉండి పోరాడతాం.

పోలవరం నిర్వాసితుల బాధలు చూస్తున్నాం

తెల్లం శంకురుడు, రమణక్కపేట



పోలవరం నిర్వాసితులు భూములు ఇచ్చి, గ్రామాలను ఖాళీ చేసి ఎంత ఇబ్బంది పడుతున్నారో చూస్తున్నాం. ధైర్యం నింపడానికి వామపక్ష నాయకులు రావడం సంతోషం. పోలీసులు ఒత్తిడి చేసినా వెనక్కి తగ్గే ప్రసక్తే

ఎంఎల్ఎ ఇక్కడి ప్రజలకు వ్యతిరేకంగా పని చేయడం బాధాకరం

కారం నాగదుర్గ, దాట్లవారిగూడెం



ఆయుధ డిపో వద్దంటే కేసులు పెట్టేందుకు చూస్తున్నారు. ఉద్యోగాలు, అభివృద్ధి అంటూ అబద్దాలు చెబుతున్నారు. ఇక్కడ బాగానే ఉన్నాం. ఆయుధ డిపో వంకావారిగూడెం పంచాయతీ పరిధిలో వద్దు.. వేరేచోట పెట్టుకోండి. ఎంఎల్ఎ ఇక్కడి ప్రజలకు వ్యతిరేకంగా పని చేయడం బాధాకరం.

మా అందరిదీ ఒక్కటే మాట

మడకం శేషగిరిరావు, దాట్లవారిగూడెం



వైసిపి ప్రభుత్వంలో అప్పటి ఎంఎల్ఎ కు, కలెక్టర్కు డిపో వద్దంటూ వినతులు ఇచ్చాం. మూడుసార్లు గ్రామసభలో తీర్మానాలు చేశాం. ఇప్పుడు మళ్లీ పెడతానంటున్నారు. గ్రామసభకు 50 మంది పోలీసులను పెట్టారు. కొంతమందికి మాయమాటలు చెప్పి మాపై ఉసిగొల్పాలని చూస్తున్నారు. మా అందరిదీ ఒక్కటే మాట.. వెనక్కి తగ్గేది లేదు.

అనుమతి నిరాకరించి.. మళ్లీ వెనక్కి తగ్గి

వామపక్ష పార్టీల రాష్ట్ర నేతలు వంకావారిగూడెం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో సోమవారం పర్యటనకు సంబంధించి ఆ పార్టీల జిల్లా నాయకులు ముందుగా పోలవరం పోలీస్ డివిజన్ అధికారులను అనుమతి కోరుతూ దరఖాస్తు చేశారు. ఆదివారం రాత్రి అనుమతి నిరాకరిస్తూ వెనక్కి లేఖ పంపారు. ఆ లేఖలో ఆయుధ డిపో రక్షణశాఖకు సంబంధించిందని, ధర్నాలు, ఆందోళన చేయడం నిషిద్ధమని అనేక అంశాలను పేర్కొన్నారు. అంతటితో ఆగకుండా కలెక్టర్, ఆర్డిఒలు అనుమతి కోరాలంటూ ముక్తాయించడం కొసమెరుపు. దీంతో పోలీసులు వామపక్ష నాయ కులు పర్యటనను అడ్డుకుంటారనే ప్రచారం సాగింది. వామపక్ష రాష్ట్ర నాయకుల కార్యక్రమాన్ని అడ్డుకుంటే రాష్ట్రవ్యాప్తంగా అలజడి రేగే అవకాశం ఉందని గమనించి పోలీసులు వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది.

ఆగని బస్సు ప్రమాదాలు

ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా
ఒకరు మృతి, పలువురికి గాయాలు




బోల్తాపడిన ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు

ప్రజాశక్తి - చింతలపూడి

లింగపాలెం మండలం జూబ్లీ నగర్ వద్ద ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరికొందరికి గాయాలైన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భారతి ట్రావెల్స్కు చెందిన బస్సు లింగపాలెం మండలం ధర్మాజీగూడెం నుంచి వయా చింతలపూడి, సత్తుపల్లి మీదుగా హైదరాబాద్ బయల్దేరింది. సుమారు 15 మంది ప్రయాణికులతో ఈ బస్సు బయల్దేరిన పది నిమిషాలకే యడవల్లి వద్దకు వచ్చేసరికి మోటారు సైకిల్ను ఢీకొంది. ఈ క్రమంలో అక్కడ బస్సు ఆపకుండా డ్రైవర్ బస్సు వేగం పెంచగా, జూబ్లీ నగర్ వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బస్సులో హైదరాబాద్ బయల్దేరిన అయ్యప్పరాజుగూడేనికి చెందిన సాఫ్ట్వేర్ ఉద్యోగి వీరింకి ప్రవీణ్బాబు (26) బస్సు కింద చిక్కుకుని మృతి చెందాడు. మరో నలుగురికి గాయాలయ్యాయి. ప్రమాద విషయం తెలియగానే ధర్మాజీగూడెం ఎస్ఐలు సతీష్, వెంకన్నబాబు, చింతలపూడి సిఐ క్రాంతికుమార్ హుటాహుటీన అక్కడికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. బోల్తా పడిన బస్సును పైకి లేపగా ప్రవీణ్బాబు మృతదేహం లభ్యమైంది. ఇక ఈ బస్సు ముందుగా ఢీకొన్న మోటారు సైకిల్పై ప్రయాణిస్తున్న యడవల్లికి చెందిన పి.కృష్ణ (35), బి.రెడ్డియ్య (60)లకు తీవ్ర గాయాలవ్వడంతో మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్కుమార్ పరిశీలించారు. అలాగే ప్రమాదానికి గురైన బస్సును జిల్లా రవాణాశాఖాధికారి షేక్ కరీం పరిశీలించారు. ఈ బస్సు అరుణాచల్ ప్రదేశ్ రిజిస్ట్రేషన్తో ఉండగా, యజమాని హైదరాబాద్లోని మల్కాజ్గిరికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లుగా కన్పించిందని బస్సులోని ప్రయాణికులు తెలిపారు. ప్రస్తుతం డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

ప్రతి అర్జీకి శాశ్వత పరిష్కారం చూపాలి

పిజిఆర్ఎస్లో వచ్చిన అర్జీలు 454
కలెక్టర్ కె.వెట్రిసెల్వి


సమస్యలు వింటున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

పిజిఆర్ఎస్లో ప్రజలు అందించిన ప్రతి అర్జీకి శాశ్వత పరిష్కారం చూపాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. స్థానిక కలెక్టరేట్లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా అధికారులతో ఆమె నిర్వహించారు. జిల్లా కలెక్టర్తోపాటు జాయింట్ కలెక్టర్ ఎంజె.అభిషేక్గౌడ, డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, ఆర్డిఒ ఎం.అచ్యుతఅంబరీష్, డిప్యూటీ కలెక్టర్ ఎల్.దేవకిదేవి, ఎస్సి కార్పొరేషన్ ఇడి ఎం.ముక్కంటి, డిఆర్డిఎ పీడీ ఆర్.విజయరాజు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై ప్రజలు సమర్పించిన అర్జీల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలన్నారు. శాఖలవారీగా వచ్చిన అర్జీలను పరిశీలించి తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. అర్జీల పరిష్కారంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నిర్లక్ష్యానికి తావు లేదని, అధికారులు కలసికట్టుగా పని చేయాలని సూచించారు. అర్జీలు రీఓపెన్కు ఆస్కారం లేకుండా పరిష్కారం చూపాలని, అదే ఫిర్యాదు రెండోసారి వస్తే ఆయా అధికారి వైఫల్యంగా గుర్తించి, ఆ అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టి.నరసాపురానికి చెందిన సామాజిక కార్యకర్త సయ్యద్ నాజర్ పాషా చింతలపూడి నుండి టి.నరసాపురం ప్రధాన రహదారి అభివృద్ధి చేయడం, అసంపూర్తిగా నిలిచిన టి.నరసాపురం నుండి బంధంచర్ల రహదారి పూర్తి చేయడం, టి.నరసాపురం హోమియో ఆస్పత్రికి భూమి కేటాయింపు, నిధులు మంజూరు చేయాలని అర్జీ ఇచ్చారు. హైకోర్టు తీర్పును అనుసరించి కూతలగూడెం గ్రామ పంచాయతీ చేసిన తీర్మానాన్ని జిల్లా కలెక్టర్ రద్దు చేసి, కనకాద్రిపురం గ్రామంలో నూతన పంచాయతీ భవనాన్ని నిర్మించాలని కొయ్యలగూడెం మండలం కనకాద్రిపురానికి చెందిన ఎన్.సత్యభామ కోరారు. పెదపాడు మండలం సీతాపురానికి చెందిన వెన్నమనేని వెంకటేశ్వరరావు అన్నదమ్ములు 3.94 ఎకరాలు సమానంగా పంచుకున్నామని, అయితే ఎల్పి నెంబరు ఒక్కటే ఇచ్చారని, దీనివల్ల చాలా ఇబ్బందులు తలెత్తున్నాయని అన్నారు. రీసర్వే చేసి హద్దులు నిర్ణయించి రెండో ఎల్పి నెంబరు ఇప్పించాలని అర్జీ ఇచ్చారు. ఉంగుటూరు మండలం కైకరం-వెంకట కృష్ణాపురానికి చెందిన ముంగర ప్రవీణ్ కుమార్ తన తండ్రి ఆర్టిసి గ్యారేజీలో మెకానిక్గా పని చేస్తూ మృతి చెందారని, కారుణ్య నియామకానికి అప్పుడు వయస్సు సరిపోదని తెలపగా, ఇప్పుడు 19 ఏళ్లు నిండాయని వెళ్తే స్పందించడం లేదని, తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

11న జెడ్పి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 11వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుండి జిల్లా పరిషత్ సమావేశపు హాలులో జరుగుతుందని జెడ్పి సిఇఒ శ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ చైర్పర్సన్ గంటా పద్మశ్రీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

వర్షాలకు దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టాలి

సంబంధిత అధికారులకు జెడ్పి ఛైర్పర్సన్ పద్మశ్రీ ఆదేశం


అధికారులతో మాట్లాడుతున్న జెడ్పి ఛైర్పర్సన్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన జిల్లా వ్యాప్తంగా ఉన్న జెడ్పి రహదారుల స్థితిగతులపై సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మొంథా తుపాన్ ప్రభావంతో దెబ్బతిన్న రహదారుల పరిస్థితులను అధికారులు సమీక్షించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా తక్షణ మరమ్మతు పనులు ప్రారంభించాలని ఛైర్పర్సన్ ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాలు, అంతర్గత రహదారులు, పంటల రవాణా మార్గాలు ప్రత్యేక దృష్టిలో ఉంచుకుని రహదారుల పునరుద్ధరణను వేగవంతం చేయాలని సూచించారు. ముందస్తు చర్యల కోసం సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసి, ప్రతి హాబిటేషన్కు రహదారి కనెక్టివిటీ నిలకడగా ఉండేలా కృషి చేయాలని ఘంటా పద్మశ్రీ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అత్యవసర రహదారి మరమ్మతు పనులు ఇప్పటికే ప్రారంభించినట్లు, ఫీల్డ్ టీమ్లు నిరంతరం పరిస్థితులను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ప్రజలకు రహదారి సౌకర్యాలు అత్యంత కీలకమని పేర్కొన్న జెడ్పి ఛైర్పర్సన్, సమస్యలు తక్షణమే పరిష్కరించేందుకు ఈ సమీక్షా సమావేశం నిర్వహించామని వెల్లడించారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ సూపరింటెండింగ్ ఇంజనీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సహా విభాగాధికారులు పాల్గొన్నారు.

ఉదయం ఎండ.. మధ్యాహ్నం వర్షం


కురిసిన వర్షానికి నిలిచిన నీరు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు నగరంలో సోమవారం ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. అయితే మధ్యాహ్నం సమయంలో ఆకస్మికంగా ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. వర్షం కారణంగా ఉక్కపోత తగ్గి ప్రజలు కొంత ఉపశమనం పొందారు. అయితే డ్రెయిన్లలోని మురుగునీరు వర్షపు నీటితో కలిసి రోడ్లపైకి చేరడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కొద్దిపాటి వర్షానికి డ్రెయినేజీలు నిండిపోయి రోడ్లపై నీరు చేరుతుందని, డ్రెయినేజీలు శుభ్రం చేయాలని ప్రజలు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు.

నేలపైనే నిద్ర.. దుప్పట్లూ లేవు

- స్లాబ్ నుంచి కారుతున్న నీరు
- ఆర్ఒ వాటర్ ప్లాంట్ లేకపోవడంతో తాగునీరు కొనుక్కోవడమే
- పడమటిపాలెం బాలురు, బాలికల వసతిగృహాల్లో పరిస్థితి

ప్రజాశక్తి - కలిదిండి

మండలంలోని పడమటిపాలెం పంచాయతీ పరిధిలోని సాంఘిక సంక్షేమ బాలుర, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ బాలికల వసతి గృహాల్లో విద్యార్థులు పలు సమస్యలను ఎదుర్కొంటున్నారు. బాలుర వసతి గృహంలో విద్యార్థులు మంచాలు లేక నేలమీదే నిద్రిస్తున్నారు. వారికి దుప్పట్లు కూడా అందించలేదు. బాలికల వసతి గృహంలో శ్లాబు నుంచి నీరు కారుతుంది. ఇలా పలు సమస్యలతో వసతి గృహాల్లో విద్యార్థులు విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

మండలంలోని పడమటిపాలెం పంచాయతీ పరిధిలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులు 91 మంది ఉంటున్నారు. వసతి గృహంలో నాలుగు మరుగుదొడ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. ఆర్ఒ వాటర్ ప్లాంట్ లేకపోవడంతో తాగునీరు టిన్నులతో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మంచాలు లేకపోవడంతో నేల మీదే పడుకుంటున్నామని, దుప్పట్లు కూడా అందించలేదని, దీంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని విద్యార్థులు వాపోతున్నారు.


బాలికల హాస్టల్ ప్రాంగణంలో నిలిచిన నీరు


నేలపైనే నిద్రిస్తున్న విద్యార్థులు

వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివే బాలికలు 77 మంది ఉన్నారు. ప్రహరీ లోపల పల్లంగా ఉండటంతో వర్షం కురిసిన సమయంలో నీరు నిలుస్తుంది. మొదటి అంతస్తులో నాలుగు గదులున్నాయి. రెండు గదుల్లో శ్లాబు నుంచి నీటి చుక్కలు పడుతున్నాయి. వసతి గృహం బయట చెత్త కుండీ లేకపోవడంతో చెత్తను గోడ పక్కన వేసి తగలబెడుతున్నారు. ఆర్ఒ వాటర్ ప్లాంట్ లేకపోవడంతో తాగునీరు ఎప్పటికప్పుడు టిన్నులతో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించి ఇబ్బందుల్లేకుండా చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రజాశక్తి పరిశీలన

వ్యకాస జిల్లా మహాసభను జయప్రదం చేయాలి

ఆ సంఘం జిల్లా కార్యదర్శి పిల్లి రామకృష్ణ



ప్రదర్శనలో వ్యకాస నేతలు

ప్రజాశక్తి - టి.నర్సాపురం

మండల కేంద్రమైన టి.నరసాపురంలో ఈ నెల 5, 6 తేదీల్లో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం 32వ జిల్లా మహాసభ జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి పిల్లి రామకృష్ణ పిలుపునిచ్చారు. వ్యకాస బహిరంగ సభ జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లి రామకృష్ణ మాట్లాడుతూ ప్రజలకు విద్య, ఉపాధి, మౌలిక వసతులు, ఇల్లు ఇళ్ల స్థలాలు కోసం అసైన్డ్ భూములు ఎల్టిఆర్ వంటి అనేక భూ పోరాటాల్లో ప్రజల పక్షాన నిలబడిన సంఘం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అన్నారు. మండలంలో మొట్టమొదటి సారిగా జరుగుతున్న సంఘం 32వ జిల్లా మహాసభలో ప్రజలు, పోరాట గ్రామాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్రావు మాట్లాడుతూ ఆరో తేదీన జరుగుతున్న జిల్లా స్థాయి కాన్ఫరెన్స్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటారని, మూడేళ్లకు సరిపడా కొత్త కార్యాచరణ రూపొందించుకుని కొత్త పోరాటాలతో ముందుకెళ్లే విధంగా ఈ సభలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు లోకుమూడి విద్యార్థులు

ప్రజాశక్తి - మండవల్లి

రాష్ట్రస్థాయి కోకో పోటీలకు లోకుమూడి పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పులగం వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణా జిల్లా గుడివాడలోని ఎన్‌టిఆర్ స్టేడియంలో సోమవారం డివిజన్ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో పాఠశాల విద్యార్థినిలు ప్రతిభ కనబరిచి ఆటలో అత్యుత్తమమైన నైపుణ్యాన్ని ప్రదర్శించడంతో జిల్లా స్థాయికి ఎంపికయ్యారని చెప్పారు. అండర్-19 విభాగంలో వై.సంజన, 14 విభాగంలో బి.ఐశ్వర్య కమల, కె.మహి ఎంపికయ్యారని తెలిపారు. డివిజన్ స్థాయి నుండి జిల్లా స్థాయికి ఎంపికయ్యేలా తర్ఫీదు ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. జిల్లాస్థాయి ఆటల పోటీల్లో కూడా మరింత నైపుణ్యం ప్రదర్శించి పాఠశాలకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో ఎంపిసి ఛైర్మన్ బి సునీత, సర్పంచ్ కోటి నాగమణి, వ్యాయామ ఉపాధ్యాయుడు బాబు, తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి ఎంపిడిఒగా రమణబాబు

ప్రజాశక్తి - మండవల్లి



మండల పరిషత్ కార్యాలయానికి నూతన అభివృద్ధి అధికారిగా కె.రమణబాబు సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. కృష్ణా జిల్లాలో జిల్లా పరిషత్ ఎ సెక్షన్‌లో పరిపాలన అధికారిగా పనిచేస్తున్న ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగోన్నతి కల్పించడంతో మండవల్లి మండల పరిషత్ కార్యాలయానికి అభివృద్ధి అధికారిగా వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ముదినేపల్లి మండలానికి చెందిన ఎంపిడిఒ మండపల్లి మండలానికి ఎంపిడిఒగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా రమణబాబు మాట్లాడుతూ మండవల్లి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. మండవల్లి మండలానికి ఎంపిడిఒగా ఘన స్వాగతం పలికి ఆహ్వానించిన సిబ్బందికి, కార్యదర్శులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఉంగుటూరు డిప్యూటీ ఎంపిడిఒగా రమేష్‌బాబు

ప్రజాశక్తి - ఉంగుటూరు



ఉంగుటూరు డిప్యూటీ ఎంపిడిఒగా గెడ్డం రమేష్‌బాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన కాకినాడ జిల్లా జగ్గంపేటలోని మన్యంవారిపాలెం గ్రామ కార్యదర్శి నుంచి ఉద్యోగోన్నతిపై ఉంగుటూరు డిప్యూటీ ఎంపిడిఒగా వచ్చారు. ఈ సందర్భంగా మండల పంచాయతీ కార్యదర్శులు మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. అనంతరం గ్రామాల్లో పారిశుధ్యంపై కార్యదర్శులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పారిశుధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల కమిటీ అధ్యక్షుడు నేతల విజయ్‌కుమార్, ఉపాధ్యక్షురాలు ధనలక్ష్మి, కార్యదర్శులు పాల్గొన్నారు.

అందరూ విధిగా మొక్కలు నాటాలి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం


మండలంలోని పరింపూడి గ్రామంలో ప్రకాశం డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం శిబిరం చివరి రోజు ప్రత్యేకంగా నిర్వహించారు. మొక్కలు నాటండి.. పర్యావరణాన్ని కాపాడండి అనే నినాదంతో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, గ్రామ పరిసరాల్లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి కొయ్యలగూడెం ఎంపిడిఒ కె.కిరణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మొక్కలను నాటి విద్యార్థులను అభినందించారు. పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రతపై అవగాహన పెంచడం చాలా అవసరమని, విద్యార్థులు ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం మంచి విషయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ వద్ది జనార్ధన్‌రావు, ప్రిన్సిపల్ సిహెచ్.హనుమాన్ చౌదరి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రసాద్, పవన్‌కుమార్, జి.వరలక్ష్మి, డాక్టర్ మరపట్ల రాజు, తదితరులు పాల్గొన్నారు. కళాశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కలు నాటడంలో చురుకుగా సహకరించారు.

అక్రమానికి పాల్పడ్డ సిబ్బందిపై చర్యలు తీసుకోండి

'మీకోసం'లో రావిచర్ల సర్పంచి ఫిర్యాదు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని రావిచర్ల గ్రామంలో సర్వే నెంబర్ 422లో ఉన్న బంజరు భూమి 15 సెంట్ల స్థలం వందేళ్ల ఏళ్ల నుంచి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఉందని సర్పంచి కాపా శ్రీనివాసరావు తెలిపారు. గ్రామపంచాయతీ 15 ఏళ్ల క్రితం కరెంటు మోటార్ ఏర్పాటు చేయడంతో ప్రజలు



ఫిర్యాదు చేసిన సర్పంచి కాపా శ్రీనివాసరావు

తాగునీటి అవసరాలకు వినియోగిస్తున్నట్లు చెప్పారు. దళితవాడలో ఎవరు మృతి చెందినా మట్టి చేసిన తరువాత ఈ బావి వద్ద స్నానాలు ఆచరించడం జరుగుతుందన్నారు. ఎక్కువ మంది స్నానాలు చేసేందుకు ఇబ్బందికరంగా ఉండడంతో పెద్దలు, ప్రజల సహకారంతో వాటర్ ట్యాంక్ నిర్మించేందుకు సిమెంటు పిల్లర్లు వేస్తున్న సమయంలో గ్రామంలోని చెరుకూరి బ్రహ్మేశ్వరరావు, వారి కుమారులు జెసిబితో సిమెంట్ పిల్లర్లను ధ్వంసం చేశారని వాపోయారు. ఇదే భూమిలో పది సెంట్లు వారికి చెందినదని ఎల్‌పిఎం చూపించారని, ప్రభుత్వ భూమిని ప్రయివేట్ వ్యక్తులకు పట్టా ఎల్‌పిఎం నెంబర్ ప్రభుత్వ సిబ్బంది ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. అన్యాయానికి కారకులైన ప్రభుత్వ సిబ్బందిని కఠినంగా శిక్షించాలని కోరారు. పట్టా, ఎల్‌పిఎం నెంబర్లను రద్దు చేసి సదరు భూమిని గ్రామపంచాయతీ ఆధీనంలోకి ఇవ్వాలని కోరారు. ఈ మేరకు నూజివీడు పట్టణంలోని సబ్ కలెక్టర్‌కు సోమవారం మీకోసంలో అర్జీ దాఖలు చేసినట్లు చెప్పారు.

పరీక్షా కేంద్రం తొలగింపు సరికాదు

పోలవరం :ఎన్నో దశాబ్దాలుగా ఉన్న పోలవరం హైస్కూల్లో పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని తొలగించే ప్రయత్నాలను వెంటనే నిలిపివేయాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి సొబ్బన మోహన్, ముత్యాల రాంబాబు, సొబ్బన రాజశేఖర్‌బాబు, కోరసిక నాగబాబు, పైడిపాక నవచైతన్య, అంబేద్కర్ యువజన సంఘ అధ్యక్షులు ఈర్నాల జానుబాబు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన విద్యాశాఖాధికారులు భిన్నంగా వ్యవహరించడం సరికాదని తెలిపారు.

నేరాలు - ఘోరాలు

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బైక్ : వ్యక్తి మృతి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ద్విచక్రవాహనం ఢీ కొట్టిన ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని రమణక్కపేట సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... జీలుగుమిల్లి మండలంలోని పునరావాస కాలనీ కోయిదాకు చెందిన కాకాని రవి సోమవారం ద్విచక్రవాహనంపై వ్యక్తిగత పనుల నిమిత్తం బయటకు బయలుదేరాడు. ఈ క్రమంలో రమణక్కపేట సమీపంలోకి వచ్చేసరికి ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో అతని తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

నాటుసారా, మద్యం సీసాలు స్వాధీనం

చింతలపూడి :అక్రమంగా నాటుసారా, మద్యం అమ్ముతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ అశోక్ తెలిపారు. చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నాగిరెడ్డిగూడెం గ్రామంలో నాటు సారా స్థావరాలపై సోమవారం దాడి చేశారు. ఈ దాడిలో నాగిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన మహిళ వడిత్య రమ్యను అదుపులోకి తీసుకుని ఆమె వద్ద నుంచి నాలుగు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. రేచర్ల గ్రామంలో బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించగా జరపాల ధనలక్ష్మిని అదుపులోకి తీసుకుని ఆమె వద్ద నుంచి ఆరు మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నాగిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన మహిళ వడిత్య చిలకమ్మాను తహశీల్దార్ ఎదుట హాజరు పరచగా ఆ మహిళపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

8, 9 తేదీల్లో బాలలకు పలు పోటీలు

జయప్రదం చేయాలని హేలాపురి బాలోత్సవం ఆహ్వాన సంఘం పిలుపు



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

ప్రజాశక్తి - ఏలూరు

ఈ నెల 8, 9 తేదీల్లో జెవియర్ హైస్కూల్లో మైక్ ఆర్ట్, మ్యాజిక్ పేపర్ క్రాఫ్ట్ శిక్షణ, నవంబర్ తొమ్మిదో తేదీన బాలలకు ఫ్యాన్సీ డ్రెస్, పద్యాలు, రైమ్స్ అన్ని కేటగిరిల వారికి చిత్రలేఖనం పోటీలను జయప్రదం చేయాలని హేలాపురి బాలోత్సవం ఆహ్వాన సంఘం సమావేశం విజ్ఞప్తి చేసింది. యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో హేలాపురి బాలోత్సవం ఆహ్వాన సంఘం సమావేశం సోమవారం నిర్వహించారు. నిర్వాహక కార్యదర్శి గుడిపాటి నరసింహారావు స్వాగతం పలికారు. ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఆహ్వాన సంఘం ఛైర్మన్ గౌరవ కార్యదర్శి డాక్టర్ రవి గోపాలకృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి దేవరకొండ వెంకటేశ్వర్లు, గౌరవ సలహాదారు ఎల్‌వి.సాగర్, వర్కింగ్ ప్రెసిడెంట్ బిజీ ఎం వి ఆర్.కృష్ణారావు, ఎకడమిక్ అంశాల కన్వీనర్లు ఎస్.కస్తూరిరావు, కె.శ్రీనివాసరావు, కల్చరల్ అంశాలకు కన్వీనర్ డి.హేమసుందర్ మాట్లాడారు. పెద్దలు ప్రముఖులు వివిధ సంస్థలకు చెందిన 280 మందితో కూడిన ఆహ్వాన సంఘం కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం సమావేశం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ 2019 నుంచి జరుగుతున్న హేలాపురి బాలోత్సవం పిల్లల సంబరాలు జెవియర్ బాలలకు ఫ్యాన్సీ డ్రెస్, పద్యాలు, రైమ్స్, సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్‌కు చిత్రలేఖనంలో ప్రతిభ ప్రదర్శనలో జిల్లాలో ఆసక్తి గల విద్యార్థులు పాల్గొనేలా చేయాలన్నారు. ఛైర్మన్ అడుసుమిల్లి నిర్మల మాట్లాడుతూ తొమ్మిదో తేదీన ఏర్పాట్ల కోసం ఆహ్వాన సంఘం సభ్యులు, న్యాయ నిర్ణేతలు సిద్ధం కావాలన్నారు. నిర్వాహక కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 60 కేంద్రాల్లో జరుగుతున్న బాలోత్సవం అందరికి ఉత్సాహం పరుస్తుందన్నారు. డాక్టర్ గోపాలకృష్ణయ్య, ఎల్‌వి.సాగర్, ప్రధాన కార్యదర్శి దేవరకొండ వెంకటేశ్వర్లు, విజయ్‌ఎంబిఆర్.కృష్ణారావు మాట్లాడారు. ఈ సమావేశంలో వివిధ బాధ్యతలు తీసుకున్న పి.కస్తూరిబాయ్, ఎ.మోహిని, పిఎస్.రమణ, వై.ఆనందనాయుడు, డివిఎ.నరసింహారావు, మేతర అజయ్‌బాబు, కె.శ్రీనివాసరావు, శ్రీపాద కోటి, ఎ.ఉత్తమమూర్తి, వి.సాయినాథ్, వక్ల కవి శ్రీనివాసరావు, కె.రంగనాయకి, పి.భాస్కరరావు, ప్రకాష్, కె.శ్రావణికుమారి, డి.శ్రీనివాస్, జి.రాంబాబు, జి.బాబు, ఎస్.రవి, ఎ.కోహినూర్, ఎం సాయి సిద్ధార్థ్, బి.నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి పోలీసు శాఖ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తుందని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ అన్నారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్, ఎఎస్‌పి సూర్యచంద్రరావులు ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారు.

నిర్ణీత సమయంలో సమస్యలు పరిష్కారం

నూజివీడు టౌన్ :ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు అర్జీల ద్వారా అందించిన సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించనున్నట్లు నూజివీడు సబ్ కలెక్టర్ బి.వినూత్న తెలిపారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో సోమవారం మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. నూజివీడు రెవెన్యూ డివిజన్ పరిధిలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సబ్ కలెక్టర్‌కు అందించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ బి.వినూత్న మాట్లాడుతూ ప్రతి అర్జీ ఆన్‌లైన్ చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోపు అన్ని సమస్యలు పరిష్కరించనున్నట్లు చెప్పారు. జటిలమైన సమస్యలు పరిష్కారం కాకుంటే వాటి వివరాలను అర్జీదారులకు వివరిస్తామన్నారు.

ఉచిత శిక్షణకు మైనార్టీల నుంచి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఏలూరు

సిఇడిఎం ద్వారా టెట్, డిఎస్‌సి, ఎస్ఐ, కానిస్టేబుల్ పోటీ పరీక్షలకు అర్హులైన మైనారిటీ (ముస్లిమ్స్, క్రిస్టియన్స్, సిఖ్స్, బుద్ధిష్ట్, పారిస్, జైన్స్) అభ్యర్థులకు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు మైనారిటీల ఆర్థిక సంస్థ ఇన్‌ఛార్జి కార్యనిర్వాహక సంచాలకులు కెఎస్.ప్రభాకరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన ఆసక్తి కలిగిన అభ్యర్థులు www.apced-mmwd.org వెబ్‌సైట్‌లో తమ దరఖాస్తు తమ దరఖాస్తులను చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాల కోసం 0866-2970567 సంప్రదించవచ్చని తెలిపారు.

భారత మహిళా క్రికెట్ జట్టుకు వైష్ణవి అభినందన

ప్రజాశక్తి - ముదినేపల్లి

వన్డే వరల్డ్ కప్ ఫైనల్‌లో అద్భుత విజయం సాధించి ట్రోఫీ గెలుచుకున్న భారత మహిళా క్రికెట్ జట్టుకు అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి సోమవారం అభినందనలు తెలిపారు. ముదినేపల్లిలో ఆమె మాట్లాడుతూ భారత మహిళా క్రికెట్‌కు ఇది సువర్ణాధ్యాయమని, ప్రతి భారతీయుడు గర్వపడేలా ఆడి, వన్డే వరల్డ్ కప్ గెలవడం ద్వారా మన మహిళా క్రికెటర్లు చరిత్ర సృష్టించారని ఆమె అన్నారు.

నేడు కారం పార్వతి వర్ధంతి సభ

ప్రజాశక్తి - పోలవరం

కారం పార్వతి 28వ వర్ధంతి సభను ఈ నెల నాలుగో తేదీ మంగళవారం జిల్లెల్లగూడెం పంచాయతీ పరిధిలోని మనుగోపాల గ్రామంలో ఏజెన్సీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి కుంజం రామారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సభలో రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ భాషా, ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుంజం రామారావు, జిల్లా నాయకులు సవలం రాంబాబు తదితరులు పాల్గొని మాట్లాడారని తెలిపారు.

6, 7 తేదీల్లో సిపిఐ (ఎంఎల్) మహాసభ

ప్రజాశక్తి - ముసునూరు

డిసెంబర్ 6, 7 తేదీల్లో కడపలో నిర్వహించే సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ తొమ్మిదో రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని కిసాన్ మహాసభ మండల కార్యదర్శి పామర్తి రామారావు అధ్యక్షతన కరపత్రాల పంచుతూ గుల్లపూడి గ్రామంలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి వేముల బక్కయ్య మాట్లాడుతూ తుపాను వల్ల పంటలు నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం చెల్లించాలని, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పామర్తి రామారావు, పామర్తి రాజేశ్వరి, పల్లి పాము భవాని, పామర్తి వెంకటేశ్వరరావు, పామర్తి రాణి, పామర్తి వరాలు, బేతపూడి ఏసు, గోళ్ల కొండయ్య, పామర్తి స్వాతి, పర్స సాయిరాం, చిట్టి మాద సీతారామయ్య పాల్గొన్నారు.

ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలిక

15 నిమిషాల్లో కనిపెట్టి తల్లికి అప్పగించిన పోలీసులు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఇంటి నుంచి కనిపించకుండాపోయిన బాలికను 15 నిమిషాల వ్యవధిలో పోలీసులు కనిపెట్టి బాలిక తల్లికి అప్పగించారు. ఏలూరు రూరల్ ఎస్ఐ నాగబాబు తెలిపిన వివరాల ప్రకారం... రూరల్ పరిధిలోని మాదేపల్లి గ్రామానికి చెందిన జయమంగళ మహాలక్ష్మి 12 ఏళ్ల కుమార్తె సోమవారం ఉదయం పది గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. చుట్టుపక్కలా వెతకగా ఎక్కడా బాలిక ఆచూకీ లభ్యం కాకపోవడంతో తల్లి 112 నెంబర్‌కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చింది. రూరల్ ఎస్ఐ నాగబాబు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికి 15 నిమిషాల్లో బాలికను పట్టుకుని ఆమె తల్లి మహాలక్ష్మికి అప్పగించారు. దీంతో బాలిక తల్లి ఎస్ఐ నాగబాబుకు కృతజ్ఞతలు తెలిపింది.

సాయం అందించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న బాధితులు

ప్రజాశక్తి - చింతలపూడి

మొంథా తుపాన్ నేపథ్యంలో పునరావాస కేంద్రంలో ఉన్న తమకు ప్రభుత్వం ప్రకటించిన సాయం అందించాలని బాధితులు కోరారు. ఈ మేరకు మొంథా తుపాన్ నేపథ్యంలో చింతలపూడి బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రం బాధితులు సోమవారం ఆందోళన చేసి ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం అందించారు. అనంతరం ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయానికి ప్రదర్శనగా వెళ్లి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొంథా తుపాన్ నేపథ్యంలో పట్టణంలో రెండు పునరావాస కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. ఆ కేంద్రాల్లో ఉన్నవారిని ఇంటికి పంపేటప్పుడు ఒక్కో కుటుంబానికి రూ.వెయ్యి నుంచి రూ.మూడు వేలు, అలాగే వారికి బియ్యం, నూనె, పప్పు, కాయగూరలు అందిస్తామని ప్రభుత్వం చెప్పిందని తెలిపారు. ఒక కేంద్రంలో వారికి అందించి మరొక కేంద్రంలో బాధితులకు ఏమి ఇవ్వకుండా ఇంటికి పంపించారన్నారు. బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ఉన్నవారికి ఏమి అందించలేదన్నారు. కొంతమందికి సహాయం చేసి మిగిలిన వారికి ప్రభుత్వ సహాయం అందించకపోవడం శోచనీయమని సిపిఎం మండల కన్వీనర్ పి.పాండురంగారావు అన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాధితులకు మద్దతుగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు దేవగురు సత్యనారాయణ, సిపిఎం పట్టణ కార్యదర్శి ఎస్.సూర్యకుమార్, రామిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

అంజయ్య సేవలు అజరామం


సంస్మరణ సభలో ప్రముఖులు

ప్రజాశక్తి - దెందులూరు

మండలంలోని కొవ్వలి గ్రామానికి చెందిన డాక్టర్ బూసి అంజయ్య సంస్మరణ సభ సోమవారం ఏలూరులోని ఒక ప్రయివేట్ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. సభకు బహుజన ఆఫీసర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించి మాట్లాడారు. అంజయ్య డాక్టర్‌గా, ఉద్యోగ సంఘాల నాయకులుగా అందించిన సేవలు అజరామమని ఆయన కొనియాడారు. ముఖ్య అతిథిగా ఎన్‌జిఒ సంఘం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మాజీ అధ్యక్షులు లాం విద్యాసాగర్ హాజరయ్యారు. అంజయ్య వియ్యంకులు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ రిటైర్డ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ బొంతు రాజేశ్వరరావు, సర్ సిఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ చర్చిల్ డేనియల్, ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్స్ ఉమ్మడి జిల్లా పూర్వ గవర్నర్ కెవి.కిషోర్‌కుమార్, పెదవేగి ఎస్ఎంసి విద్యాసంస్థ అధినేత అవినాష్‌రాజు, బహుజన నాయకులు బేతాళ సుదర్శన, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు, అర్జా రాజకుమార్, గొల్ల కిరణ్‌కుమార్, కార్పొరేటర్ పాము శామ్యూల్, కమ్ముల పెద్దిరాజు, డాక్టర్ కోటేశ్వరరావు, పళ్లెం ప్రసాద్, మాజీ డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, పారిశ్రామికవేత్త బంకా ప్రసాద్, లయన్స్ క్లబ్ నాయకులు ఎన్‌వి.సురేష్‌కుమార్, డాక్టర్ కెవి.ప్రభాకర్‌రావు మాట్లాడారు. అంజయ్య కుమారులు వ్యాపారవేత్త సురేంద్ర, ఐఎఫ్ఎస్ అధికారి సుచింద్ర, ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారి అల్లుడు కొండ్రు తులసీదాస్, ఇతర కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

ప్రజాశక్తి - చింతలపూడి



మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్

రక్తదానం చేయడం వల్ల మరొక ప్రాణాన్ని కాపాడవచ్చని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ తెలిపారు. చింతలపూడి సిఐ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ సతీష్‌కుమార్ పర్యవేక్షణలో పోలీస్, రెడ్‌క్రాస్ సంస్థ, లయన్స్ క్లబ్, స్వచ్ఛంద సంస్థ, చింతలపూడి జిమ్ ఆధ్వర్యంలో చింతలపూడి వికెఎం ఫంక్షన్ హాల్ వద్ద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో సిఐ, ఎస్ఐ రక్తదానం చేశారు. ఈ సందర్భంగా చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం ప్రతి ఏటా అక్టోబర్ 21వ తేదీన నిర్వహించుకుంటారని చెప్పారు. అమరవీరులను స్మరించుకుంటూ వారం రోజులపాటు వారోత్సవాలు నిర్వహిస్తారని తెలిపారు. అందులో భాగంగా నేడు రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రక్తదానం చేయటం వల్లన అత్యవసర సమయంలో ప్రాణాలు కాపాడవచ్చు తెలిపారు. తలసేమియా వ్యాధి బాధితులకు ఈ రక్తం ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్, రెడ్ క్రాస్ కో ఆర్డినేటర్ సోమశేఖర్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

యాత్రికులతో పట్టిసీమ కిటకిట



లాంచీ వద్ద యాత్రికుల రద్దీ

ప్రజాశక్తి - పోలవరం

కార్తీక సోమవారం సందర్భంగా శ్రీ భద్రకాళి సమేత వీరేశ్వర స్వామి ఆలయంలో యాత్రికులు రద్దీ ఉధృతంగా కొనసాగింది. ఉదయం నుంచే పరిసర గ్రామాల నుంచి యాత్రికులు బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలతో పట్టిసీమకు చేరుకున్నారు. గోదావరి నదిని దాటేందుకు ఏర్పాటు చేసిన లాంచీల ద్వారా యాత్రికులు క్షేత్రానికి చేరుకుని స్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. యాత్రికుల సౌకర్యార్థం ఆలయ అధికారులు క్యూలైన్లు, తాగునీరు, భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారు. ఆలయ పరిసరాల్లో క్యూలైన్లు, బందోబస్తు, రేవు వద్ద భద్రతా ఏర్పాట్లు సక్రమంగా ఉన్నాయా అనే అంశాలను పోలవరం డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు, సిఐ బాల సురేష్ బాబు స్వయంగా పర్యవేక్షించారు. అనంతరం స్వామివారి దర్శనం చేసుకున్నారని ఆలయ ఇఒ సిహెచ్.వెంకటలక్ష్మి తెలిపారు. కార్తీకమాసంలో వచ్చే యాత్రికులకు అన్నదాన సదుపాయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సోమవారం దాదాపు 1500 మంది యాత్రికులు స్వామివారిని దర్శనం చేసుకుని అన్నప్రసాదం స్వీకరించారని, యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా లాంచీల్లో ప్రయాణించేలా ఎస్ఐ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు సమర్థవంతమైన ఏర్పాట్లు చేశారని ఇఒ తెలిపారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి - ముదినేపల్లి

సిఎం సహాయ నిధి నుంచి హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను ఎంఎల్‌ఎ కామినేని శ్రీనివాస్ సోమవారం అందించారు. మండలంలోని బొమ్మినంపాడుకు చెందిన గంగుల వెంకటనారాయణకు హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.1.10 లక్షల చెక్కును ఎంఎల్‌ఎ కామినేని శ్రీనివాస్ తన కార్యాలయంలో అందించారు.

ఆర్థిక ఆస్తులను క్లెయిమ్ చేయించుకోండి

ప్రజాశక్తి - ఏలూరు

పౌరులు బ్యాంకు డిపాజిట్లు, బీమా ఆదాయం, మ్యూచువల్ ఫండ్లు, డివిడెండ్, షేర్లు వంటి క్లెయిమ్ చేయని ఆర్థిక ఆస్తులను గుర్తించి క్లెయిమ్ చేసుకోవడానికి ప్రభుత్వం వీలు కల్పించిందని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరరావు తెలిపారు. కేంద్ర ఆర్థిక మంత్రి 2025 అక్టోబర్ 4న దేశవ్యాప్తంగా "మీ డబ్బు - మీ హక్కు" అనే ప్రచారాన్ని ప్రారంభించిన నేపథ్యంలో మూడు నెలల ప్రచారంలో భాగంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్, స్టేట్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ సూచనల మేరకు అన్ని బ్యాంకులు, బీమా కంపెనీల భాగస్వామ్యంతో కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కస్టమర్ ఔట్రీచ్ కార్యక్రమం నిర్వహించారు. డిఆర్‌ఒ విశ్వేశ్వరయ్య మాట్లాడుతూ ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, జిల్లా అధికారులందరూ బ్యాంకర్ల సహకారంతో చాలా సంవత్సరాల నుంచి వాడకంలో లేని అకౌంట్లను గుర్తించి ఆక్టివేట్ చేయించాల్సిందిగా తెలిపారు. ఏలూరు జిల్లా లీడ్ బ్యాంక్ డి.నీలాద్రి మాట్లాడుతూ అన్ని బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీలతో ఇక్కడ స్టాల్స్ ఏర్పాటు చేశామని, ప్రజలు తమ క్లెయిమ్‌లను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. రానున్న మూడు నెలల కాలంలో ఈ కార్యక్రమం గురించి విస్తృత ప్రచారం చేస్తామని తెలిపారు. వాడకంలో లేని, ఎవరు క్లెయిమ్ చేయని అమౌంట్ 23 బ్యాంకుల్లో రూ.106.53 కోట్లు గుర్తించామని లీడ్ బ్యాంకు మేనేజర్ తెలిపారు. ఎల్‌ఐసి అసిస్టెంట్ డివిజనల్ మేనేజర్ పద్మావతి, ఎస్ఎల్ఐసి, పిఎన్‌బి మెట్ లైఫ్ కన్వీనర్ సాంబశివరావు మాట్లాడారు.

అంత్యక్రియలకు వైష్ణవి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- ముదినేపల్లి

నిరుపేద వృద్ధురాలి అంత్యక్రియలకు అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి ఆర్థిక సాయం అందించారు. మండలంలోని పెదపాలపర్రు గ్రామానికి చెందిన ఎం.సీతారత్నం(60) అనారోగ్య కారణాల రీత్యా మరణించారు. ఈ విషయం తెలుసుకున్న అంబుల వైష్ణవి వృద్ధురాలు అంత్యక్రియల నిమిత్తం తనవంతు సాయంగా ఆమె తండ్రి డాక్టర్ మనోజ్ ద్వారా రూ.ఐదు వేల నగదును మృతురాలి కుటుంబ సభ్యులకు అందించారు.

పిహెచ్‌సికి దుప్పట్లు, దిండ్లు వితరణ

ప్రజాశక్తి - ఉంగుటూరు

కడియాల సత్యనారాయణ కుటుంబసభ్యులు కడియాల ఫణీంద్ర (చిన్ని), మనవరాలు కడియాల చరిత కాగుపాడు పిహెచ్‌సికి దుప్పట్లు, దిండ్లు వితరణ చేశారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని జనరల్ వార్డులోనికి బెడ్ షీట్లు, దుప్పట్లు, దిండ్లు డ్యూటీ డాక్టర్ అనూషకు అందించారు.

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ దుర్మార్గం

ప్రజాశక్తి - ముసునూరు

మెడికల్ కళాశాలలను ప్రయివేట్ పరం చేయడం దుర్మార్గమని వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన అన్నారు. మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి చేపట్టిన కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమం వైసిపి మండలాధ్యక్షులు మూల్పూరి నాగవల్లేశ్వరరావు అధ్యక్షతన మండలంలోని లోపూడి గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రయివేటీకరణ ఆలోచనతో పేదలు వైద్య విద్యకు దూరమవుతారన్నారు.

మహారాజశ్రీ 2వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్), నూజివీడు వారి కోర్టులో
ఓ.యస్.నెం.297/2025

బిట్వీన్ :
తటపర్తి మాణిక్యాలరావు ...వాది
మరియు
1.మొహ్మద్ రెహమాన్ ఖాన్
2.యర్రంశెట్టి దుర్గా ప్రసాద్ ...ప్రతివాదులు
టు
1వ ప్రతివాది :
మొహ్మద్ రెహమాన్ ఖాన్, తండ్రి పచుయా, వయస్సు 55 సం॥లు, శానిటరీ మేస్త్రి, నూజివీడు మున్సిపాలిటి, నూజివీడు, కృష్ణాజిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా.

పై నెంబరు దావాలో 1వ ప్రతివాది అయి మీరు పైన పేర్కొనిన మీరు శ్రీకోర్టు వారి ఎదుట హాజరు అగుటకు గానూ వాయిదా ది.27-11-2025వ తేదీన వున్నది. సదరు తేదీన ఉదయం 10.30 ని॥లకు మీరు స్వయంగా గానీ, మీ న్యాయవాది గారి ద్వారా గానీ శ్రీకోర్టు వారి ఎదుట హాజరు అయ్యి మీ ఆక్షేపణలను తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమునందు తీర్మానించుదురు.
శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారముగా
మన్నం రమేష్
నూజివీడు వాది తరపు న్యాయవాది
ది.03-11-2025 సెల్: 9440257636

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
Creditor I.P.No.42/2025

Between:
నేకూరి సరోజ ...పిటీషనరు
And
కొయ్యా అప్పారావు మరియు అదర్స్
...రెస్పాండెంట్లు

పై కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఒకటవ రెస్పాండెంటు అయిన కొయ్యా అప్పారావు గారు 2వ, 3వ రెస్పాండెంట్లు అయిన దుగ్గిరెడ్డి శశికాంత్ రెడ్డి మరియు చింతంరెడ్డి రమ్యకృష్ణ వార్లకు వ్రాయబడిన రిజిష్టరు దస్తావేజు నెం.7498/2025 తేదీ 23-06-2025 గల దస్తావేజును తాడేపల్లిగూడెం సబ్ రిజిస్ట్రారు ఆఫీస్‌లో రిజిష్టరు కాబడిన దస్తావేజును రద్దు చేయుటకు గానూ ఎవరికైనా అభ్యంతరములు ఉన్నచో ది.18-11-2025వ తేదీన పై కోర్టు వారి ఎదుట స్వయంగా గానీ, న్యాయవాది గానీ హాజరు అయ్యి తెలియపరుచుకోవలయును. లేనియెడల మీ పరోక్షమున తీర్మాణము చేయబడును.
శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం
P.Praveen Prakash
Advocate,
Tadepalligudem Tadepalligudem.
Dt.03-11-2025 Cell: 8309619225.

మహారాజశ్రీ భీమవరం రెండవ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) మరియు జ్యుడిషియల్ Ist క్లాసు మేజిస్ట్రేట్ వారి కోర్టులో
O.S.No.123/2024

వాది : ముత్యాల హేమ దుర్గా నాగరాజు
ప్రతివాద్లు : 1.సోడదాసి కస్తూరి
2.సోడదాసి వందన
(2nd Plaintiff being minor represented by her next friend & Mother the Ist Plaintiff)
D-1 : అడ్రస్సు : సోడదాసి కస్తూరి,
W/o.స్వరూప్ కుమార్(లేటు),
R/o.D.No.9-13-425, YSR Nagar,
తాడేరు రోడ్డు, గునుపూడి, భీమవరం - 1.

పై నెంబరు దావాలో ప్రతివాద్లు దావా సమన్లు అందుకోకుండా కాలయాపన చేయుచున్నారు. ప్రతివాద్లు హాజరు నిమిత్తము శ్రీకోర్టు వారు ది.4-12-2025 తేదీన వాయిదా వేసినారు. సదరు వాయిదా తేదీన ఉదయం 10.30 ని॥లకు మీరు పైకోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియచేసుకోవలెను. లేనియెడల పై దావాను మీ పరోహమందు తీర్మానించబడును.
Yerra Venkata Narasimha Rao
Dattala Willingston,
Advocates, Sarraju Street,
Bhimavaram - 534201, (W.G.Dt)